# అల్లో నేరేడు

ఎబ్బే! ఇప్పటి పట్నం మునుపటి పల్లెకాదు.

మునుపటి పల్లె ఆనవాలే ఇప్పుడులేదు.

పాడూరులేదు - కూలిపోయి పునాదులు మిగిలిన గుళ్ళు లేవు, గోపురాలు లేవు! ఎంతలోతు తవ్వినా నిధులులేవు, నిక్షేపాలులేవు! ఆ పరగణా హోల్ మొత్తం మీద, అప్పుడు రాలిన గింజన్నా మొక్క మొలవలేదు. అప్పటికి మొలిచిన మొక్కన్నా మానుకట్టలేదు. ఆనాటికి నిలిచిన మానన్నా, ఒక్క బోదెన్నా, సత్యానికి నిలువలేదు. సంజెదీపం వేళకు కళగాఉన్న పల్లె, మళ్ళీ చుక్కపొడిచే వేళకల్లా, ఒక్క మొయిని సురేసుకు పోయినట్టు పోయింది.

ఏమైపోయిందంటారు?

ఎండకన్నెరుగని ఆడకూతురు అయినవారింట పుట్టి అబ్బనాకారంగా పెరిగి, ఆ యింట అడుగు పసుపు పారాణితో, పాపిట బొట్టుతో, చెంపన చుక్కతో, సిరులబ్బే చూపుతో యీ యింట పెట్టిన ఆడకూతురు చేయరాని పాపం చేయకపోయినా, మోయరాని నింద మోసింది. అయ్యో పాపం! అన్నవారు లేకపోయిరి. కుయ్యో అన్నా గోడు ఆలకించేవారు కరువై పోయిరి. ఆ బిడ్డ ఎంత హడలిందని! ఆ తల్లి బ్రతుకు ఒక్క చిటికెలో చీకటి గుయ్యారమైపోగా ఎంత కుమిలిందని?

ఒక్క కన్ను మూసింది. ఒక్క కన్ను తెరిచింది. ఎందుకు యిచ్చావమ్మా యీ పుటక? అంటూ కన్నతల్లిమీద గావురుమంది. కానరాని తల్లికి మొక్కుతూ గావురుమంది. తెరిచిన కన్ను నిప్పులు చెరిగింది. మూసిన కన్ను ఒక్క ముత్తెం విడిచింది.

ఆ రవంత ముత్తెం సముద్రమంత అయింది. సముద్రం - సముద్రం ఏడు సముద్రాలంత అయింది. ఏడు సముద్రాలు ఏక ఉప్పెనై ంది.

ఉప్పెనొచ్చి ఊరు ముంచెత్తింది: పోటొచ్చి పల్లెపల్లె నేలమట్టం చేసింది. ఆటొచ్చి, ఆ చీపరపాపర అంతా తుడిచిపెట్టింది.

తుడిచి పెట్టినంత మేరా - వానదేవుడొచ్చి, కల్లాపి జల్లాడు. గాలిదేవుడొచ్చి తడి ఆరబెట్టాడు. సూర్యభగవాన్లు అప్పుడు తెరపి చేసుకుని వచ్చి, భూమ్మీద ముగ్గులల్లే నెరియ విచ్చాడు. అంతే, ఆ పొద్దు మొదలాయె ఆ గడ్డమీద ప్రాణాడదు: ఆ నింగిమీద పిట్టాడదు!

సరేనయ్యా - మరి, ఆ ఆడకూతురు కొచ్చిన నిందేమి టంటారు!

ఆడకూతురికి రారాని నింద!

అయిన యిల్లాలికి కలలో అన్నా రాకూడని నింద! కట్టుకున్న మా రాజే తప్పుబట్టెనే — ఆ తల్లిని అంతమాటంటే పాపమన్నా తలచక పోయెనే - ఒట్టూ సత్యాలూ నమ్మకపోయెనే - ఇంకేంజెయ్య నా తల్లి? ఇంకెవరితో మొరబెట్టుకోను ఆ అమ్మ!

సీతమ్మంటే సీతామ్మవారేనయ్యా! ఆ అయ్య రాముడంటి వాడేనయ్యా! అయితేనేం, మూడు పువ్వులూ ఆరు కాయలూ కావల్సిన బతుకు మూణ్ణాళ్ళ ముచ్చట అయింది. ఆ కాపురం ఆరిపోయే దీపమల్లే ఒక్కసారి భగ్గుమంది.

సీతమ్మ సిరిగల యింట పుట్టింది. సంపదున్న యింటికి వచ్చింది! ఆ బిడ్డ తెచ్చిన సారె, పల్లె అంతా ముమ్మారు పంచిపెట్టినా, ఎక్కిదక్కి మిగిలింది. రామయ్య కుటుంబం అంటారా, పరగణా పరగణాకంతా మోతుబరీ అనుకోండి: వారికి ఏం తక్కువ? గీతొక్కటే తక్కువ: బ్రహ్మరాసిన రాతొక్కటే తక్కువ!

సీతమ్మ అల్లా వైభోగంగా సార్లెతో - చీర్లెతో తర్లి వచ్చింది: వెంటను, పట్టెమంచం వచ్చింది, పానుపొచ్చింది: రంగరంగ వైభోగా లొచ్చినాయ్.

తూర్పువేపు గదిలో పానుపేశారు: పడమటింట బంతులు బరి, విందులు చేసుకుంటున్నారు.

వచ్చిన చుట్టాలందరూ, జాజంబంతులు ఆడుకున్నారు.

మేజువాణీలు చేయించుకున్నారు.

తెల్లవారుజాముకి ఎక్కడి వారక్కడ అలసిపోయినారు. చోటుచూసుకు సొమ్మసిల్లి పోయినారు.

సీతమ్మ అంతదాకా మేలుకుండలా! ఆ విద్దెలూ ఆ చోద్దాలూ ఆ తల్లికి నచ్చలా !

వచ్చే అవులింతను చిటికివేసి ఆవులించింది. అక్కడ నుంచి బద్దకంగా లేచి పోయింది. బద్దకంగా పోయిపోయి ఆ నిద్దురమత్తులో, అల్లాగే పక్కమీద చోటు చూచుకుని వాలిపోయింది. వాలిన పళాన నిద్దరోయింది.

ఏ మూలనో కునుకుతీసిన రామయ్యకు కోడికూత వేళకు ఎవరో వెన్ను చరిచినట్టు మెలకువ వచ్చింది. తానున్న వెంపు చూసుకున్నాడు, తనవెంపు చూసు

కున్నాడు. ఒక్క ఒళ్ళు విరుపులో, పట్టెమంచం యాదకొచ్చింది, పండంటి పిల్లది యాదకొచ్చింది. లేచి నడిం వాకిలి కొచ్చాడు. చుక్కలమీదికి చూశాడు. ఇంకా జాము ప్రొద్దుందిగదా అనుకున్నాడు. ఉసూరుమన్న ప్రాణికి ఉత్సాహం వచ్చింది. ఒంటికి వేడొచ్చింది, చెంపకు ఒరచూపొచ్చింది. చివాల్న పోయినాడయ్యా, పానుపువేసిన గదిలోకి.

సీతమ్మ పొత్తకమల్లే ఒత్తిలి పడుకుంది. మాంచి నిద్దర్లో వుంది. అట్టె పరకాయించాడు. అడుగులో అడుగేసుకుంటూ చెంపమీద చిటికేశాడు. చిటికేసినంత చిరునవ్వు నవ్వాడు. అంతే ప్రాపతం ఆ యింటికి.

చిటికెలోనే మేలుకుంది సీతమ్మతల్లి. చిరునవ్వుకు నాగసారం విన్న ఆడ త్రాచైంది. పంచప్రాణల్తోనూ మిడిసిపడి ఆ మెడ కావిలేసుకుంది. ఏమో కులికింది. ఏమో గునిసింది. ముచ్చటాడే పాణెం నేరని చిన్నది మూగపోయింది. అయితేనేం గడియలతరబడి వేగిన వేగూ - సోగిన సోగూ, కనుపాప విప్పిచెప్పింది.

చెప్పిందయ్యా చిన్నదాని కనుపాప. ఆకళింపయిందయ్యా చినవాడికి. చిలక ముక్కుకు దొండపండందినట్టు, జీరుగోరికి చివురాకు అందినట్టు సుఖపడేవాడే! — సుఖపెట్టేవాడే—కాని, చిన్నది ఆ నోము నోచలేదు. చినవాడికి ఆ అదృష్టం పట్ట లేదు. తొలిముచ్చటకు కలకట్టుగా, సొక్కిసోలుతూన్న చిన్నది - అటు వాలేదల్లా చటుక్కుమని ఇటుకేసి బెదిరి, త్రుళ్ళిపడి కెవ్వున కేకవేసింది.

ఆ వేసిన కేకకు ముసుగువన్ని ఒళ్ళు తెలియని నిద్దర్లో ఉన్న ప్రాణి చింబోతల్లే ఎగిరి గంతేసింది. ఆ చింబోతు, చింబోతంటారా? కాదు కాదు, రామయ్య తమ్ముడు కామయ్య. బంగారువంటి మనిషి, బంగారమంటి మనసు - భయమూ భక్తీ ఉన్న పడుచువాడు.

కెవ్వుమన్న కేకకు మెళకువ వచ్చింది. అన్నను చూశాడు, వదిన్ని చూశాడు, తానున్న పానుపు చూశాడు. అయ్యో రామా అని అంగలార్చి, అన్న పాదాలమీద పడి

పోయినాడు. అవురుమన్నాడు. ఎంత తప్పు - తప్పని వాపోయి, తల నేలనేసి కొట్టుకున్నాడు. ఆఖరికి - అన్నా! అన్నాడు. "వదినె మనింటి కొచ్చిన పండగలో ఒళ్ళు మరచిపోయినా, అటునుంచి వస్తున్నా, అగరొత్తులు గుప్‌మన్నాయి. ఆగి పోయినా. గుమ్మం వారకొచ్చి తొంగిచూసినా. గుమగుమా అత్తరు దీపం వెలుగు తూంది. కన్నెదర పాలమీగడల్లే పానుపు అగుపించింది. తడిమి చూసినా — తబ్బిబ్బై ్ౖ పోయినా. నడుం అదే వాలింది. ఒళ్ళు అదే ఆదమరచింది. మగత మగతగానే పట్టు కుచ్చులాటి శాలువా పైకి లాక్కున్నా. ఒక్క కునుకు తీసి లేద్దామనుకున్నా - మరి ఒళ్ళు తెలియలా! నా మనవి ఇంతేనన్నా !"

కామయ్య తల ఛెళ్ళున తన్నాడు, రామయ్య తండ్రి ఒళ్ళు తెలియని ఉగ్రంతో! మెడనరాలు ఫెట ఫెడ మెటికిలు విరిగినాయ్ ! అంత తాపూ తిని, కామయ్య గుక్క తిప్పుకున్నాడు.

"పర్వతంలాగా పడుంటివే. కానరాలేదా తల్లీ!" అన్నాడు.

వెక్కి వెక్కి వచ్చే దుఃఖం ఆపుకుంటూ, "నా దైవం అనుకుంటినయ్యా ! అలికిడైతే మెలుకువ వచ్చేనని పట్టి నిలకరచుకుని పండుకున్నానయ్యా !" అన్నది సీతమ్మ.

"విన్నావుగందా అన్నా" అన్నాడు లేనిసత్తువ తెచ్చుకుంటూ, కామయ్య. ఆనడమేమిటి, మళ్ళీ అన్న రామయ్య మరో తన్ను తన్నడమేమిటి! తన్నిన తన్నుకు, మెడనరాలు మరిన్ని మెటికెలు విరిగినయ్. గుండెలు, నాభి దగ్గిరికి కుంగిపోయినాయి. పడగ విప్పిన తాచైనాడు కామయ్య. నిదుర లేచిన సింహమైనాడు కామయ్య. ఏను గంత సత్తువొచ్చింది. పట్టిన గుప్పిటిపట్టు విదిలించుకున్నాడు. తూలే కాలు దువ్యబట్టు కున్నాడు. చీమైపోయి, దోమైపోయి, అంటున్నాడు గంవా! "అన్నా, నా మనవి ఆల కించవయ్యా !"

అన్న—రామయ్య ఏ మాటా చెప్పడే! కాళ్ళా వేళ్ళాబడి బతిమాలుకుంటోన్న తమ్ముణ్ణి కన్నెత్తి చూడడే !

అడుగులో అడుగేసుకుంటూ రామయ్యొచ్చాడు. అల్లంత దూరాన సీతమ్మొచ్చింది. వచ్చి వచ్చి – మానేసుకుపోయినారు. నోటి మాట రాక - పలుకరించలేక –

జామైంది, గడియైంది. రామయ్య కదిలాడు. ఒక్క ఉరుకురికాడు. తమ్ముణ్ణి పట్టుకుని గాను గాదేశాడు.

జామపండల్లే విచ్చిన గడ్డం చేతబుచ్చుకుని, రామయ్య నొష్టతో అన్నకు మొక్కాడు.

"ఒంటిఊపిరినవుంది ఈ పుటక!- ఒక్క ప్రాణమూ పుచ్చుకో అన్నా, ఉడుకుమీదున్నావ్! ఉగ్రాలమీదున్నావ్–ఈ పళాన నన్ను తెగెయ్యకపోతే నువ్వు బతికేట్టు లేవు" అని బతిమాలాడాడయ్యా !-

"ఒంటి పాన్పుమీదుంటిరే - పిల్లమన సేయలా !"

"రామరామ !"

"చెయి మీదికిపోలా ? -"

"చెయ్యిలేని పున్నెం తవ్వి తలకెత్తుకున్నాడు బిడ్డ. తల్లొచ్చి–పక్కను పండుకుంది. అది అన్నెం అంటావా ?"

"వదిన్ని కంట జూడలా !"

"ఒక్క రెప్ప - "

"వల్లమాలిన చక్కంది. ఒక్క రెప్పలోనే మనసు గుంజుకునుంటుంది!- నీవు ఓ రెప్పను చూశావు ! నేను వేయిపుటకలకని మనసిచ్చాను - నిన్ను చీల్చినా మచ్చపోతుందా ?-" పసిపిల్లడల్లే బావురుమన్నాడు రామయ్య! అంతతో తమ్ముడు ఉగ్రుడైనాడు.

"తల్లివయే భాగ్యం తాళికట్టి తెచ్చుకున్నవాడు దక్కనీయలా! పోనీలే అమ్మ! కన్నవారు పేరెట్టుకున్నందుకు, ఆ తల్లి కష్టాలే నీకూ వచ్చినాయా! మల్లెపూవల్లే మా యింటికొచ్చావ్, సిగలో ముడుచుకోడం నేరకపాయె. కళ్ళనద్దుకుంటున్నా తల్లీ! మా తప్పులు కాయద్దు - మా వంగసం నిలవద్దు. శిక్షించక జాలిదలచావో వేయి పుటకలు పుట్టివెంటాడుతా-" ఒక్క బిగివిని యీ మాటలనేసి సూరడికి మొక్కి కామయ్య తూరే గల్లే పోయి ఏటిలో కలిసిపోయినాడు.

"వాదురాకుండా వాడే పోయినాడు. యింటికివస్తే ఏలుకుంటా" నన్నడయ్యా! సీతమ్మ ఉలకలా. "పల్లెకుపోతే తలెత్తుకు తిరగలేను - ఏం గందరగోళంగా ఉందో - ఎన్ని కమామేషులు పుట్టినాయో - అన్నీ నరంలేని నాలుకలు — " సీతమ్మ పలకలా!

"కాపురం పాడుచేసుకుంటావా?-" సీతమ్మ మరింత ఉగ్రంగా నవ్వింది. రామయ్య పొటేలల్లే రొప్పుకుంటూ పారిపోయినాడు. పల్లెలో కనబడ్డవాడల్లా పలుకరించాడు. కంటబడిన ఆడకూతురల్లా నిలవేసింది! ఏమైంది సీతమ్మ? ఏటొడ్డునుంది. తాను తెగించిందా, నువ్వు విడిచావా? దైవానికి తెలియాలి. ఊరుకు వంక తెచ్చింది! కత్తులు లేచినాయ్, కటార్లు దూసినాయ్ - పల్లెపల్లే ఏటివారకు దండుకట్టింది.

అక్కడ సీతమ్మ తపసులో ఉంది. ధ్యానంలో ఉంది. దిగువ నేకాడనో సందడాయె. రానురాను, మందొస్తున్న అలికిడాయె. ఓరచూపు చూసింది. ఒక్క కన్ను విప్పుకుంది. పుట్టబోయే బిడ్డలు కేరుమన్నారు. తరించబోయేటి వాళ్ల తల్లీ అన్నారు. ఏదీ వినలా. ఆడపుటకైతే యింత అలుసా అనుకుంది. కామయ్యను తలుచుకుని, నా తండ్రే అనుకుంది. ఒక్కపుటక పుట్టావే నన్ను ఉద్దరింవావ్. మళ్ళీ జన్మలెత్తే పని లేదు. పగదీరుస్తున్నా బయల్లో కలసి....అంది.

తెరచిన కన్ను నిప్పులు చెరిగింది.

అందుకు ఇదీ కథ -!